సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



సీతారాముల పరిణయానికి ఏర్పాట్లు

విశాఖ: అంబికాబాగ్ రామాలయంలో కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి.

IIలో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
పాడేరు, అరకు	6.15	4.29
రంపచోడవరం	6.29	4.35

న్యూస్‌రీల్

మోదమ్మకు ఘనంగా పూజలు



అమ్మవారి సన్నిధిలో భజన చేస్తున్న పాడేరు సాయిరాం భక్త మండలి సభ్యులు

సాక్షి,పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పాడేరు ప్రాంతానికి చెందిన భగవాన్ సాయిరాం భక్త మండలి సభ్యులు అమ్మవారి సన్నిధిలో భజన చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

టెన్త్ మూల్యాంకనం పరిశీలన



టెన్త్ మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న టెన్త్ మూల్యాంకనాన్ని కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదివారం పరిశీలించారు. జవాబు పత్రాలను దిద్దుతున్న ఉపాధ్యాయులు, డీఈవో బ్రహ్మాజీరావు, ఇతర విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించిన క్యాంపు అధికారి, డీఈవో, డిప్యూటీ క్యాంపు అధికారి వినయ్‌మోహన్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్‌లను ఆమె అభినందించారు.

ఘనంగా తిరునాళ్లు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజవొమ్మంగి: స్థానిక గ్రామ దేవత నూకాలమ్మ తల్లి తిరునాళ్లు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం వరకు జరగనున్న తిరునాళ్ల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

కాసుల దండతో అలంకరణ

గ్రామానికి చెందిన మజ్జి రమణ కుటుంబసభ్యులు ఆదివారం అందజేసిన రూ.15 వేల విలువైన రూపాయి కాసులతో రూపొందించిన దండను అమ్మవారికి అలంకరించారు. దీనిని చెన్నైలో తయారు చేయించినట్లు వారు తెలిపారు.

ఏపీ జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ సస్పెన్షన్

మోతుగూడెం: ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఏపీ జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ కాళ్ల రామకృష్ణను యూనియన్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎంవీ రాఘవరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి నెలలో 327 యూనియన్‌లో ఉన్న కొంతమంది వ్యక్తులను ఇతర యూనియన్ సభ్యులతో కుట్రపన్ని గంజాయి కేసులో ఇరికించేందుకు ప్రయత్నించాడని ఆయన తెలిపారు. దీంతోపాటు యూనియన్ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీన మోతుగూడెంలో జరిగిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో రామకృష్ణను యూనియన్ నుంచి తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్షకు 2,236 మంది దరఖాస్తు

- పరీక్ష తేదీ ఈనెల 20కి మార్పు

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఐదు ఏకలవ్య పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ పరీక్షకు 2,236 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వై.రామవరం ఈఎంఆర్ పాఠశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 13వ తేదీన జరగాల్సి ఉండగా ఈనెల 20వ తేదీకి వాయిదా పడ్డాయన్నారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఏపీటీడబ్ల్యూఆర్ (గర్ల్స్ స్కూల్, రంపచోడవరం), ఏపీటీడబ్ల్యూఆర్ (బాయ్స్ స్కూల్, రంపచోడవరం), ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ (రాజవొమ్మంగి) ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్ చింతూరు (బీపీటీజీ), ఈఎంఆర్‌స్కూల్ (చింతూరు) కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు.

ఆరాధ్యదైవం నూకాలమ్మ

- ఘనంగా కొత్త అమావాస్య జాతర ప్రారంభం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయ ఈవో
- భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



అనకాపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు.. ఆరాధ్యదైవం అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఈవో బండారు ప్రసాద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ రాత్రంతా అమ్మవారి దర్శనార్థం ఆలయాన్ని తెరిచి ఉంచుతామన్నారు. ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక, పౌరాణిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు.

కల్పవల్లి ధారాలమ్మ

- నేడు అమ్మవారి ప్రధాన పండగ
- భారీగా తరలిరానున్న భక్తులు
- దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



సీలేరు: మన్యం ప్రజల ఆరాధ్యదైవం ధారాలమ్మ తల్లి ప్రధాన పండగ కొత్త అమావాస్య సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం వేకువజామునుంచి మధ్యాహ్నం వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. అనంతరం కమిటీ సభ్యుల సమక్షంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, మహానైవేద్యం సమర్పించి గర్భగుడిని మూసి వేస్తామని ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఉగాది రోజున ఉదయం 7.15 గంటలకు తలుపులు తెరిచి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆయన తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

జగన్‌వైపే గిరిజనం

ఎన్నిక ఏదైనా జిల్లాలోని మెజారిటీ ప్రజలు దశాబ్ద కాలంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొడుతున్నారు.గడచిన రెండు సార్వత్రిక ఎన్నికలతో పాటు స్థానిక సంగ్రామంలో సైతం ఫ్యాన్ గాలి కిందనే సేద తీరుతామంటూ వారు తీర్పు ఇచ్చారు. ఒక పక్క టీడీపీ ఉనికి కోల్పోతుండగా.. వైఎస్సార్‌సీపీకి ఆదరణ రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది.



- మన్యంలో 'ఫ్యాన్'కు ఎదురులేదు
- 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీలతో విజయం
- రంపచోడవరం, పాడేరు, అరకు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీకి పెరిగిన ఓటింగ్
- ఈ ఎన్నికల్లో మరింత పెరిగే అవకాశం
- గత పదేళ్లుగా ఉనికి కోల్పోతున్న టీడీపీ

రంపచోడవరం: జిల్లాలో పాడేరు, రంపచోడవరం, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇవన్నీ ఎస్టీ రిజర్వుడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుని పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలతో పాటు అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు భూములకు పట్టాలు మంజూరు వంటి శాశ్వత పథకాలతో వైఎస్సార్ సీపీ గిరిజనుల గుండెల్లో నిలిచిపోయింది. దీంతో పార్టీ బలం మరింత పుంజుకుంది.

రంపచోడవరంలో..

- 2014 ఎన్నికల్లో 38.21శాతం ఓటింగ్ సాధించిన టీడీపీకి 2019 ఎన్నికల్లో 29.34 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభంజనం వల్ల ఐదేళ్ల కాలంలో తొమ్మిది శాతం ఓటింగ్‌ను టీడీపీ కోల్పోయింది. వైఎస్సార్ సీపీకి ఓటింగ్ శాతం 45.36 నుంచి 48.72 శాతానికి పెరిగింది.
- 2014 ఎన్నికల్లో టీడీపీకి 43,934, వైఎస్సార్ సీపీకి 52,156 ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో టీడీపీకి 59,212, వైఎస్సార్ సీపీకి 98,318 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి 39,106 ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించారు.

పాడేరు నియోజకవర్గంలో...

పాడేరు నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి 13.32 శాతం సాధించగా, 2019 ఎన్నికల్లో టీడీపీ నేరుగా పోటీ చేస్తే 28,349 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంటే టీడీపీ నేరుగా పోటీ చేస్తే కేవలం 4శాతం ఓట్లు మాత్రమే పెరిగాయి.

- 2014 ఎన్నికల్లో టీడీపీ ఉమ్మడి అభ్యర్థికి 17,029 వస్తే వైఎస్సార్ సీపీకి 52,384 ఓట్లు లభించాయి. 26,141 ఓట్లు మెజార్టీ వచ్చింది. 2019 ఎన్నికల్లో టీడీపీకి 28,349 ఓట్లు వస్తే వైఎస్సార్ సీపీకి 71,153 ఓట్లు వచ్చాయి. అంటే 42,804 ఓట్లు మెజార్టీ వచ్చింది.

అరకు నియోజకవర్గంలో..

- 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి 20.42 శాతం ఓట్లు సాధించగా 2019 ఎన్నికల్లో 12.65 శాతం ఓట్లు లభించాయి. వైఎస్సార్ సీపీ ప్రభంజనంలో టీడీపీకి ఐదేళ్లలో 7.77 శాతం ఓట్లు తగ్గిపోయాయి.
- 2014 ఎన్నికల్లో టీడీపీకి 29,789 ఓట్లు, వైఎస్సార్ సీపీ 63,700 ఓట్లు సాధించగా 34,053 ఓట్ల మెజారిటీ లభించింది. 2019 ఎన్నికల్లో టీడీపీ 19,929 ఓట్లు సాధించగా వైఎస్సార్ సీపీ 53,101 ఓట్లు లభించాయి. 25,441 మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయం సాధించారు.

మరింత పెరిగిన పట్టు

2014, 2019 ఎన్నికలతో పోల్చుకుంటే వైఎస్సార్ సీపీ గ్రామస్థాయిలో మరింత బలపడింది. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారు. ప్రధానంగా పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో ఎంతో మంది గిరిజనుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. గ్రామ సచివాలయాల పరిధిలో అందించిన ప్రత్యేక నిధులతో ప్రతీ గ్రామంలో వసతులు మెరుగుపడ్డాయి. ఇవన్నీ పార్టీ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడతాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లోనూ తిరుగులేని ఆధిక్యత

పాడేరు: నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా ఐదు జెడ్పీటీసీ స్థానాలు, నాలుగు ఎంపీపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది.
అరకు: నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా ఐదు చోట్ల జెడ్పీటీసీలు, ఆరు చోట్ల ఎంపీపీల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది.
రంపచోడవరం: నియోజకవర్గంలో 11 మండలాలు ఉండగా పది స్థానాల్లో జెడ్పీటీసీలు, 11 ఎంపీపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు.

నిప్పుల కొలిమి

కూనవరంలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు



ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన చింతూరు, భద్రాచలం ప్రధాన రహదారి

చింతూరు: విలీన మండలాల్లో ఎండలు మండిపోతుండటంతో నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఉదయం 11 అనంతరం నిప్పుల కొలిమిగా మారుతోంది. చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం కూనవరం మండలంలో అత్యధికంగా 44 డిగ్రీలు, చింతూరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండవేడిమికి తాళలేక ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మండల కేంద్రాల్లో ఉదయం 11 గంటల తరువాత ప్రధాన జంక్షన్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండతీవ్రతకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చింతూరు తహసీల్దార్ నజీముల్లాషా ఓ ప్రకటనలో కోరారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు టోపీలు, కాటన్ వస్త్రాలు, సన్‌గ్లాస్‌లు ధరించాలని ఆయన సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ వంటి ద్రావణాలను తాగాలని, వడదెబ్బకు గురైన వారిని వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించలని ఆయన సూచించారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం



టీడీపీ, సీపీఎం నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మత్స్యలింగం

- అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం
- టీడీపీ, సీపీఎం నేతలు పార్టీలో భారీగా చేరిక

అరకులోయ రూరల్: ప్రజల విశ్వసం కోల్పోయిన టీడీపీ ఈ ఎన్నికల్లో భూస్థాపితం ఖాయమని అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలో చిన్నలబుడు పంచాయతీ కర్రాయిగుడ,తుర్రాయిగుడ గ్రామాల్లో టీడీపీకి చెందిన వార్డు సభ్యుడు సీతారాం, సీపీఎంకు చెందిన ,సహదేవ్, ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు సుమారు 98 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభంజనంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కొట్టుకుపోతాయన్నారు. జగనన్నకు రెండోసారి సీఎం చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, సీపీఎం నేతలు సీతారాం, సహదేవ్ మాట్లాడారు. అన్ని వర్గాలకు సువర్ణపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలన్న ఆశయంతోనే పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రమేష్, సీనియర్ నేతలు శెట్టి అప్పాలు, సంపత్‌కుమార్, పాల్‌కుమార్, కొండలరావు, విజయ్‌కుమార్, కామేష్, పూర్ణ, తిరుపతి, రఘు, నర్సింగ్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

జి.మాడుగుల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులైన టీడీపీకి చెందిన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం మండలంలోని సొలభం పంచాయతీ గొందిపాడుకు చెందిన వార్డు సభ్యుడు సీదారి కొండబాబు, కొండపల్లి సత్తిబాబు, కొండపల్లి బొంజన్న, ఉల్లి మల్లన్న, ఉల్లి సుబ్బారావు, కొండపల్లి వెంకట్, కొండపల్లి కొండబాబు, కొండపల్లి దేవరాజు, కె.పెద్ద బాలన్న, కె.వరప్రసాద్, మోహన్‌బాబు, నీలమ్మతోపాటు మరో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండలపార్టీ అధ్యక్షుడు నిర్మాని మత్స్యకొండ నాయుడు, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ కూడా చిన్నారావు, మాజీ సర్పంచ్ వంజారి సీతారాం నాయుడు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టూరిజం బోట్ల తనిఖీ



పోశమ్మ గండి వద్ద టూరిజం బోట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగార్జున

దేవీపట్నం: పోసమ్మగండి వద్ద పాపికొండల పర్యటనకు వెళ్లే బోట్లను దేవీపట్నం ఎస్‌ఐ నాగార్జున ఆదివారం తనిఖీ చేశారు. పరిమితికి మించి బోట్‌లో ఉన్న కుర్చీలను తొలగించారు. పర్యాటకులు విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. అనంతరం అంగుళూరు కాలనీలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరు ఎటువంటి గొడవలు సృష్టించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు



ఐ.పోలవరం వద్ద టీటీడీ శ్రీవారి ఆలయం

రంపచోడవరం: మండలంలోని ఐ. పోలవరం సమీపంలోని టీటీడీ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది మంగళవారం నాడు తిరుమల మాదిరిగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు పంచాంగ శ్రవణం, మధ్యాహ్నం విశేష అన్నసమారాధన జరుగుతుందని ఆలయ అధికారులు నారాయణరాజు తెలిపారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని ధర్మ ప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు

పోక్సుపేట రేంజ్ అధికారి కరుణాకర్



అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి కరుణాకర్

రంపచోడవరం: అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అటవీశాఖ పోక్సుపేట రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ తెలిపారు. అటవీ కార్చిచ్చు నివారణపై ఎర్రంపాలెం పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ తప్పిదాల వల్ల అడవిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వీటి నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. డీఆలార్వో సుజాత, మాణిక్య, సుభద్ర, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

గంగవరం : అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని పోక్సుపేట ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ ఎం. కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని కుసుమరాయి, పిడతమామిడి, ఏటిపల్లి గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బంది అడవుల్లో కార్చిచ్చుపై అటవీశాఖ సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన ర్యాలీలు, కళాజాతా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అటవీశాఖ సెక్షన్ అధికారులు నూకరాజు, అప్పారావు, ప్రశాంతకుమార్, బుల్లమ్మ, అప్పన్నదొర, జగదీష్ , మనోహర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శారదా పీఠంలో ఉగాది వేడుకలు రేపు



పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్టు పీఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సారథ్యంలో ఉదయం పంచాంగ శ్రవణంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాషణం, భక్తులకు ఉగాది పచ్చడి వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం ఉగాది విశిష్టతపై ప్రవచనం, 100 మంది కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీమద్రామయణ మహా కావ్యం నుంచి శారదా ప్రశ్నోత్తర ప్రహేళిక పేరుతో క్విజ్ నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 94403 93333 నంబర్‌లో సంప్రదించాలని పీఠం ప్రతినిధులు సూచించారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న స్థానికులు

అనకాపల్లి: నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి, ఆరోగ్యంగా జీవించవచ్చని పతంజలి యోగా సమితి అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో యోగా శిక్షణ తరగతుల్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. అన్ని వయస్సుల వారిలో తలెత్తే ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి యోగా ద్వారా కాపాడుకోవచ్చన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచేందుకు యోగా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో యోగా సమితి సభ్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి, పెంటకోట సుబ్రహ్మణ్యం, బీఎస్ఎంకే జోగినాయుడు, కొణతాల శివాజీ, కోలపర్తి గంగబాబు, కర్రి గంగాధర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహార్తికి చెక్

- ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ప్రత్యేక చర్యలు
- మూలకు చేరిన బోర్లు, తాగునీటి పథకాలు గుర్తింపు
- యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు
- అందుబాటులో నిధులు
- ఇప్పటికే 36 వాటర్ ట్యాంకుల పనులు పూర్తి
- 400 బోర్లకు మరమ్మతులు జోరు
- తాగునీరు లభ్యంతో ఆనందంలో గిరిజనులు

సాక్షి,పాడేరు: వేసవిలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ యంత్రాంగం ప్రజల కనీస తాగునీటి అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ విజయసునీత జిల్లాలోని తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా, డివిజన్‌ల పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలతో ఎప్పటికప్పుడు జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షిస్తున్నారు.

కోట్లాది రూపాయల నిధులు

జిల్లాలోని తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం, ఇతర నిధులు రూ.35కోట్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో తాగునీటి పథకాలకు సంబంధించి నిధులను పారదర్శకంగా ఖర్చుపెడుతున్నారు.

400 బోరు బావులకు మరమ్మతులు

జిల్లాలోని 22 మండలాల్లో మూలకు చేరిన బోరుబావులను యుద్ధప్రాతిపాదికన వినియోగంలోకి తెస్తున్నారు.ఎంపీడీవోలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లంతా తమ పరిధిలోని బోరుబావుల మరమ్మతుల పనులను నిరంతరం సమీక్షిస్తున్నారు. బోరుమెకానిక్‌లు, సిబ్బంది అంతా రోజువారీ బోర్‌ల మరమ్మతుల పనుల్లో నిమగ్నమై ఉన్నారు. పైపులు, ఇతర మెటీరియల్‌ను కూడా మండల పరిషత్ అధికారులు ముందస్తుగానే అందుబాటు ఉంచారు. జిల్లాలో 400 బోరు బావులు మూలకు చేరాయని గుర్తించడంతో వాటికి మరమ్మతులకు కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. ఇప్పటికే 300 బోరుబావుల మరమ్మతులు పూర్తవ్వడంతో గిరిజనులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది, మిగిలిన బోరుబావుల మరమ్మతులు కూడా ఈవారంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం శ్రమిస్తుంది.



పాడేరు మండలం చింతలవీధిలో వినియోగంలోకి వచ్చిన బోరుబావి

తాగునీటి పథకాల పనులు పూర్తి

జిల్లాలో పలు సాంకేతిక కారణాలతో మూలకు చేరిన 44 తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించారు. వీటిని అత్యవసరంగా వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో రూ.55.69లక్షల వ్యయంతో 36 పీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాలను 10రోజుల వ్యవధిలోనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవడంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది.కొత్త మోటారు, పైప్‌లైన్ వ్యవస్థ, ఇంటింటికి కుళాయిలకు ఈ నిధులను ఖర్చుపెట్టారు. డుంబ్రిగుడ మండలంలోని సార్‌నాయక్‌గుడ, చింతపల్లిలోని కొమ్మంగి-పెంకలపాడు, కొలపరి, వర్తనాపల్లి, రోలుగుంట, కుమ్మరివంచులు, పాడేరు మండలంలోని దాలెంపుట్టు, జి.మాడుగుల మండలంలోని కృష్ణాపురం, వనమామిడి, వాకపల్లి-చింతలవీధి, బొండలపనుకు, అరకులోయ మండలంలోని అంటిపర్తి,దుమ్మాగుడ,గద్యాగుడ, పెదబయలు మండలంలోని కుమ్మరవీధి,సీమకొండ,చిత్రాయిపుట్టు,పెదగుల్లెలు,బొర్రమామిడి, పాడేరు మండలంలోని పాతరపుట్టు,జోడుమామిడి, దొడ్డిపల్లి, సలుగు, మోదాపల్లి, కక్కి, అంటిలోవ, ముంచంగిపుట్టు మండలంలోని కాంద్రంగివలస, కొయ్యూరు మండలం బాలరేవులు, హుకుంపేట మండలం ఒంటిపాక, ముంచంగిపుట్టు మండలం గున్నచెలమ, జి.కే.వీధి మండలంలోని పి.కె.గూడెం గ్రామాల్లో తాగునీటి పథకాల మరమ్మతుల పూర్తికావడంతో ఈ వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. మరో 8 గ్రామాల్లో పనులు కూడా వేగవంతంగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ 'సాక్షి'కి తెలిపారు.



హుకుంపేటలో ఏర్పాటుచేసిన కుళాయి



రాజవొమ్మంగి మండలం దుసారిపాము గ్రామంలో బోరుబావికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం



జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.బోరుబావులు, తాగునీటి పథకాలను వినియోగంలోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. తక్కువ వ్యవధిలోనే పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ప్రతి రోజు తాగునీటి పథకాలు, బోర్లు మరమ్మతులపై ఇంజనీరింగ్ అధికారులు,ఎంపీడీవోలతో సమీక్షిస్తున్నాం, అనేక గ్రామాలలో గిరిజనులకు తాగునీరు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది.

– ఎం.విజయసునీత, కలెక్టర్

జూలో ఉత్సాహంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



వివిధ జంతువుల వేషధారణలో చిన్నారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 8న నేషనల్ జూ లవర్స్ డే పురస్కరించుకుని మూడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసున్న చిన్నారులకు ఈ పోటీలు నిర్వహించారు. జీబ్రా, పెద్ద పులి, సింహం, జిరాఫీ తదితర జంతువుల వేషధారణలో చిన్నారులు సందర్శకులను అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణపై పిల్లలకు బాధ్యతాయుతమైన భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. సదరన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సీఎండీ సతీష్, ఫ్యాషన్ డిజైనర్ పూజిత, డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. కార్యవర్గంలో అన్ని పదవులకు పడిన ఓట్ల వివరాలను ఆదివారం ఎన్నికల సంఘం అధికారి కేశప్రగడ వెంకట నరసింహమూర్తి వెల్లడించారు. కార్యనిర్వాహక సభ్యులుగా న్యాయవాదులు టి.రమాదేవి, బి.కుమారస్వామి, జి.వసంత లక్ష్మి, టి.పార్వతి, ఎం.గౌరీప్రసాద్, జి.జాన్‌ప్రసాద్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

ఓటమి భయంతోనే కుట్ర రాజకీయాలు

ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీటీసీ విజయ

వీఆర్ పురం: ఓటమి భయంతోనే ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని, ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడం అవివేకమని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, కూనవరం జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. విఆర్ పురం మండలం రేఖపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకునే హక్కు ఉందని, ప్రచారాన్ని అడ్డుకోవాలని అనుకోవడం మూర్ఖత్వమని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. గత రాత్రి కూనవరం మండలం కూటూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వెళ్తున్న క్రమంలో రోడ్డుకు అడ్డంగా దుంగలు అడ్డుపెట్టడం, కొంతమంది ఆదివాసీ యువకులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించి జీఓ నెంబరు 3 పై నినాదాలు చేశారని, వారిని పిలిచి మాట్లాడినా వినకుండా అడ్డుకున్నారన్నారు. గిరిజన మహిళ అని చూడకుండా మా జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయను మెడపట్టుకొని నెట్టుడం, పుస్తెలతాడు పట్టి లాగడం వంటి చర్యలకు పాల్పడినా, మేము సహించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం అమలుచేసిన పథకాలు, అభివృద్ధిని వివరిస్తుంటే తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు ఓటమి భయంతో కుట్ర రాజకీయాలతో రకరరాల ఎత్తులతో అడ్డుకుంటున్నారన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే, అరకు ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ, పూసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, చిత్రంలో జెడ్పీటీసీ విజయ

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపింది జగనన్నే

అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

ముంచంగిపుట్టు: నవరత్నాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు.మండలంలో గల కిలగాడ పంచాయితీ కేంద్రంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం సభను నిర్వహించారు.

గిరిజనులు అధిక సంఖ్యల్లో సభకు హాజరై జైజగన్ అంటూ నినాదాలు చేశారు. గిరిజన మహిళలు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌లకు పూలమాలలు వేసి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించి సభలో ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందన్నారు.వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి తనూజరాణీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎళ్లవేళల్లో గిరిజనులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. సొంత ప్రయోజనాల కోసం పొత్తులతో వస్తున్న పార్టీలని నమ్మవద్దన్నారు. సీఎం జగనన్నను ఎదుర్కోలేక, అధికారమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులు పెట్టుకుని కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు.జగనన్న ధైర్యం మాత్రము ప్రజలే అన్నారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ జగబంధు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, మండల సర్పంచుల ఫొరం అధ్యక్షుడు రమేష్, సర్పంచులు బాబూరావు, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు కొండమ్మ, గణపతి, నాయకులు అర్జున్, రామ్మూర్తి, ధనుర్జయ్, సుందరరావు, జగన్నథం, బాబురావు, రామకృష్ణ, రాంప్రసాద్, దాసు, పులిరాజు, జగన్నాథంపడాల్, సన్యాసిరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కిలగాడలో గెలిపించేందుకు మేము సిద్ధం అంటున్న నేతలు, కార్యకర్తలు

ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు అందించిన ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని టమామిడి, మిట్లపాలెం, నిమ్మలపాలెం, మల్లవరంమామిళ్లు, దుప్పులపాలెం, జల్లూరు, శెట్టిపల్లి, ధాన్యంపాలెం గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. అదే విధంగా అన్నివర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇదే తరహాలో మరింత అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించి ఈ సంక్షేమ సర్కారును మళ్లీ తెచ్చుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన నాగులపల్లి ధనలక్ష్మి అయిన నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేటమామిడిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అద్భుతం.. నాట్యకదంబం


మద్దిలపాలెం: అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర నృత్యోత్సవంలో భాగంగా నాట్య కందంబం ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అద్భుతంగా సాగింది. ముఖ్యఅతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ కళలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. అమెరికాలో స్థిరపడిన వారు స్థాపించిన ఏపీటీఏ సంస్థ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విశాఖ భరత నాట్య కళాంజలి ఫౌండర్ సంతోషి విజయ్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్య విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ పుంజల అలేఖ్యకు పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు జీవత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో నటభామిని అవార్డు గ్రహీత మంజీష, వర్ష, డాక్టర్ పుంజల వినయ్‌కుమార్, కూచిపూడి కళాకేంద్రం వ్యవస్థాపకుడు బాలకొండలరావు, ప్రిన్సిపాల్ హరిరామమూర్తి తదతరులు పాల్గొన్నారు.



నృత్యోత్సవాన్ని ప్రారంభిస్తున్న అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు

విద్యుత్ షాక్‌తో మూడు పశువులు మృతి

చింతూరు: మండలంలోని వాలమూరిగొందిలో ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై మూడు పశువులు మృతిచెందాయి. మృతి చెందిన పశువులు తమ గ్రామానికి చెందినవి కాదని, వేరే గ్రామానికి చెందినవని వాలమూరిగొంది గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ తీగలు తెగిపడిన సమయంలో మేత నిమిత్తం వచ్చిన పశువులు తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనా స్థలాన్ని చదలవాడ ఎంపీటీసీ సభ్యుడు సవలం నరేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంతంలో తరచూ పశువులు మృతి చెందుతున్నాయన్నారు. గతంలో కూడా ఇలానే గ్రామస్తులకు చెందిన నాలుగు పశువులు మృతి చెందాయన్నారు. వ్యవసాయ పనులకు వినియోగించే పశువులతో పాటు ఆవులు మృతి చెందడంతో రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. విద్యుత్ అధికారులు మృతి చెందిన పశువుల సంబంధిత రైతులకు పరిహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ మాట్లాడుతూ ఎవరో చెట్టుకి నిప్పు పెట్టడం వలన చెట్టుకూలి విద్యుత్ తీగలపై పడిందని తెలిపారు. తీగలకు విద్యుత్ సరఫరా ఉండడంతో పశువులకు తగిలి అవి మృతి చెందాయని ఆయన పేర్కొన్నారు.



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఆవు

సీతారాముల పరిణయానికి ఏర్పాట్లు

- అంబికాబాగ్‌కు కల్యాణకాంతులు
- సీతారామచంద్రాలయంలో నవమి వేడుకలు
- 18వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు

డాబాగార్డెన్స్ (విశాఖ) : లోకాభిరాముడు శ్రీరాముడు జనకసుత జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణ చేపట్టారు.

కార్యక్రమాలివీ..

ఈ నెల 9 నుంచి 18 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్యాణరాట, పెండ్లి కుమారుని చేయుట, పంచాంగ శ్రవణం జరపనున్నారు. 10 నుంచి 18 వరకు ప్రతి రోజూ ఉదయం స్వామికి విశేష ఆరాధన, సహస్ర నామార్చన, సాయంత్రం వేళల్లో విశేష ఆరాధన, హారతులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు స్వామి కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 18న శ్రీరామ పట్టాభిషేకం జరపనున్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891-2528645, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.



సీతారామచంద్రస్వామి

అత్యంత వైభవంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 18 వరకు సీతారామ కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ మేరకు అంబికాబాగ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. 9న కల్యాణ రాట, పెండ్లి కుమారుని చేయడం, అనంతరం పంచాంగ శ్రవణం (ఉగాది) ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 10 నుంచి 16 వరకు స్వామికి ప్రత్యేకాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 17న శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నామని, 18న స్వామి పట్టాభిషేకం జరుగుతుందని తెలిపారు. శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు. అనంతరం 5 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఆలయ ఏఈవో కేఎస్ తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, ఆలయ ప్రధాన అర్చకుడు బాలు పాల్గొన్నారు.